# కథ

# చెట్టునీడ

రాఘవరావుగారి ఇంటిముందుండే పెద్ద వేప చెట్టు నీడన సేద తీరనివారు ఆ ఊరులో లేరంటే అతిశయోక్తి కాదు. నేను ఇంతవరకు ఆ వేపచెట్టు నీడ ఎరుగనని ఎవరైనా అంటే వారు స్వార్థపరులైనా అయియుండాలి. అబద్ధాల కోరులైనా అయియుండాలి. పొందిన మేలు మరిచిపోయే ప్రబుద్ధులైనా అయియుండాలి. లేదా ఆ వ్యక్తి ఆ ఊరికి వచ్చి కొన్ని గంటలైనా అయియుండాలి.

ఆ చెట్టును గురించి చెప్పాలంటే రాఘవయ్యగారే చెప్పాలి. ఆయన నోటి ద్వారానే వినాలి. ఆయనకు ఆ చెట్టును గురించి చెప్పటమంటే మహాసరదా. దాని గురించి చెబుతున్నప్పుడు ఆయన కళ్ళలో కాంతి కొట్టొచ్చినట్టు కనిపిస్తుంటుంది. చెబుతున్న తీరు చూడముచ్చటగా ఉంటుంది.

ఆ ఊరి వారందరూ దాదాపు ఎక్కడికి వెళ్ళాలన్నా రాఘవయ్యగారి ఇంటిముందు నుండి వెళ్ళాల్సిందే. అందుకే ఆ రోజు అటుగా వచ్చిన ఊరివారందరూ రాఘవయ్యగారి ఇంటి ముందున్న జనాన్ని చూసి ఆశ్చర్యపోయారు. బాగా తెలిసిన కొద్దిమంది ''ఓహో! ఈరోజు సంక్రాంతి పండుగ కదా!'' అనుకున్నారు.

నిజం చెప్పాలంటే పండుగరోజుల్లోనే రాఘవయ్యగారిల్లు కుటుంబ సభ్యులతో కళకళలాడుతుంటుంది. మిగతా రోజుల్లో ఆ ఇల్లు నిశ్శబ్దంగా ఉంటుంది.

రాఘవయ్యగారి మనవడు హరీష్ వాలుకుర్చీ తీసుకొచ్చి వేపచెట్టు క్రింద వేశాడు. రాఘవయ్యగారు ఇంట్లో నుంచి వచ్చి కుర్చీలో కూర్చున్నారు నింపాదిగా. ఆయనతో పాటు ఇద్దరు మనవళ్ళు, ముగ్గురు మనవరాళ్ళు వచ్చి కుర్చీ చుట్టూ చేరారు. అప్పటి దాకా ఆయన తన వయసును కూడా మరిచి పిల్లలతో కలిసి ఆటలు ఆడాడు. అలా ఆడుతుంటే పిల్లలకు ఆనందం, ఆయనకు ఆనందం. ఆ ఆనందం తాలూకు అనుభూతులు దసరా దాకా నిలిచిపోవాలి. అదీ ఆయన కోరిక.

తాతయ్యగారి ఆప్యాయతని, అభిమానాన్ని, ప్రేమని శాశ్వతంగా పొందాలనే స్వార్థంతో హరీష్ ''తాతయ్యా! మీరు ఒక్కరే ఇక్కడ ఉండకపోతే, మా ఊరొచ్చి మా దగ్గర ఉండొచ్చుగదా! రండి తాతయ్యా'' అన్నాడు పదేళ్ళ ఆ చిన్నారి మనసులో ఏ స్వార్థం లేదు. అది స్వార్థ రహితమైన కోరిక.

వెంటనే మిగతా చిన్నారులు కూడా. ''కాదు. మా ఇంటికి రావాల్సిందే. తాతయ్యా!'' అంటుంటే వారి ప్రేమకు ఆయన గుండె చలించింది. శరీరం పులకించింది. అందరినీ కావలించుకుని గుండెకు హత్తుకున్నారు. 'అందరూ మీలాగా పసివారు కాదమ్మా! అనునిత్యం ప్రేమాభిమానాన్ని పంచటానికి. రక్తమాంసాలతో పాటు స్వార్థం, ఈర్ష్యలను నింపుకున్న పెద్దవాళ్ళకు ఇలా అప్పుడప్పుడు మాత్రమే దగ్గరవ్వాలిగాని, శాశ్వతంగా కాదు' అందామనుకుని, మనసులోనే పెట్టుకున్నాడు.

''అయ్యా! రాఘవయ్యగారు, మా చిన్నోడు అదేనయ్యా! సుబ్బారెడ్డిగారి గొడ్లు కాసే వీరన్నగాడు, కడుపునొప్పితో మెలికలు తిరిగిపోతున్నాడయ్యా! కాసిన్ని మాత్రలిచ్చి పున్నెం కట్టుకోండయ్యా!'' అనే మాటలు విని, అటువైపు చూసాడు. పక్కగా నారయ్య చేతులుకట్టుకుని నిలబడి ఉన్నాడు. తొందరగా ఇవ్వండయ్యా అనే ఆతృత ఆ ముఖంలో కొట్టొచ్చినట్టు కనిపిస్తుంది.

అది గ్రహించిన రాఘవయ్యగారు వెంటనే లేచి, ఇంట్లో నుంచి కొన్ని పిల్స్ పొట్లంగా కట్టుకుని తీసుకొచ్చి నారయ్య చేతికిచ్చాడు. ''ఇప్పుడు రెండు మాత్రలివ్వు. తర్వాత ఉదయం, సాయంత్రం రెండు పూటలు వేసుకోమను.'' అని చెప్పారు. ''అలాగేనయ్యా'' అంటూ -అక్కడ నుంచి కదలబోయాడు నారయ్య. అంతలో మరో అనుమానం వచ్చిన రాఘవయ్యగారు ''నారయ్యా! ఈరోజు పండుగ రోజు కదా! ఏమైనా వండుకున్నారా! పిల్లలు ముఖం వేలాడేస్తారు గదా!'' అని అడిగారు.

''ఎక్కడిదయ్యా! ఈ సంవత్సరం పత్తి నాశనమైంది గదయ్యా! వరి కూడా అంతంత మాత్రమే. పంటల్లేకపోతే మాకు కూలిపనులుండవయ్యా! కూటికే కష్టంగుంది. పండగపూట అప్పచ్చులు సంగతి, కూటిలోకి కూర కూడా కరువుగా ఉందయ్యా'' అని ఉన్న పరిస్థితిని వివరించాడు నారయ్య.

నిజమే! పంటలు పండకపోతే రైతుకే నష్టం కాదు. చాలా మందికి నష్టమే ననుకొని, ఉండమని చెప్పి, ఇంట్లోకెళ్ళి యాభై రూపాయల నోటు తీసుకొచ్చి, నారయ్య చేతిలో పెట్టి, ''పండుగపూట అర్థాకలిలో ఉండటం మంచిది కాదు, వెళ్ళు'' అన్నాడు రాఘవరావుగారు.

రెండు చేతులెత్తి నమస్కరించి ''అయ్యా! మీలాంటోళ్ళు ఇంకా ఉండబట్టే, ఈలోకం ఇంకా బతికుంది. లేకపోతే ఎప్పుడోముగిసిపోయేది'' అంటూ ఇంటిదారి పట్టాడు నారయ్య.

రాఘవరావుగారు ఆ మాటలకు కాస్త ఇబ్బందిగా ఫీలయ్యారు. తిరిగి వాలు కుర్చీలో కూర్చున్నారు.

అనుమానాలకు, సందేహాలకు మారుపేరైన మనవడు హరీష్ ''తాతయ్యా! మేమందరం ఊరెళ్ళిపోయిన తర్వాత, మీరొక్కరే ఎలా ఉంటారు. భయం వేయదా! అసలు మీకు రోజంతా ఎలా తోస్తుంది'' అని అడిగాడు క్వశ్చన్‌మార్కు ముఖం పెట్టి. మనవడి మాటలు విని నవ్వుకున్నారు. 'నేను ఒంటరిగా ఉండట మేమిటి! పగలంతా ఈ చెట్టుకింద పిల్లలకు పాఠాలు చెప్పటం, సాయంత్రం వేళ రోగాలతో వచ్చినవారికి హోమియోపతి వైద్యం చేయటం-మధ్య మధ్య అనేక చిక్కులతో వచ్చిన వారికి తగిన సలహాలివ్వటం, నిత్యం జరిగే పని. ఇక నాకు ఒంటరితనం ఏం తెలుస్తుంది' అని చెబుదామనుకుని, ఇదంతా చెప్పినా ఆ పసిమనసులకు అర్థం కాదని ఒక్కమాటలో ''నాకు ఈ ఊరంతా చుట్టాలేనయ్యా, వీరితోనే రోజంతా గడిచిపోతుంది'' అని చెప్పారు.

అది విని ''తాతయ్య అంతే! ఒక్కటి కూడా అర్థమయ్యే విధంగా చెప్పరు'' అన్నాడు హరీష్ బుంగమూతి పెట్టి.

ఇంతలో రాఘవయ్యగారి చిన్నకోడలు వచ్చి ''రండి మామయ్యగారు! వంట అయింది. భోజనం చేద్దురుగాని'' అని పిలవటంతో ఇంట్లోకి బయలుదేరారు పిల్లల్ని తీసుకుని.

రాఘవయ్యగారితో సహా ఇద్దరు కొడుకులు-కోడళ్ళు, కూతురు-అల్లుడు వారి పిల్లలతో సహా అందరూ భోజనానికి కూర్చున్నారు. అందరూ వడ్డించుకుని తింటున్నారు. భోజనం చేస్తూ అందరివైపు ఓసారి చూసారు రాఘవయ్యగారు. అందరితో కలిసి తింటుంటే చాలా సంతోషం కలిగింది. ఇలా ఎప్పుడూ కలిసి ఉంటే ఎంత బావుంటుంది. అనే ఆలోచన వచ్చింది. కానీ కాసేపటికి తన ఆలోచన మంచిది కాదనిపించింది. ఎప్పుడూ కలిసుంటే తేలిగ్గా మనస్పర్థలు కలుగుతాయి. నిజానికి దూరంగా ఉంటేనే ఆప్యాయతలు పెరుగుతాయేమో! అనే సందేహం కలిగింది.

అందరి నవ్వులతో, కేరింతలతో భోజనాలు ముగిశాయి. మధ్యాహ్నం కాబట్టి ఆడవాళ్ళు నిద్రకుపక్రమించే ప్రయత్నం చేస్తున్నారు. పిల్లల్ని కూడా కాసేపు కునుకు తీయమని నచ్చచెబుతున్నారు. రాఘవరావుగారు కూడా, నడుం వాలుద్దామని వచ్చి చెట్టుకింద ఉన్న వాలుకుర్చీలో వెనక్కి వాలి పడుకున్నారు.

లోపలినుంచి ఒక స్టూలు తెచ్చుకుని వచ్చి, తండ్రి ఎదురుగా కూర్చుని ''నాన్నగారూ!'' అని నసిగాడు. పరిస్థితిని అర్థం చేసుకున్న ఆయన ''ఏంటి చెప్పుబాబు'' అన్నారు.

''నాన్నగారు! ఈ వయస్సులో మీరు ఒంటరిగా ఉండటం అంత మంచిది కాదు. వచ్చి మా దగ్గరుంటే బావుంటుందనీ'' అంటూ ఆగిపోయాడు.

అది విని కాసేపు మౌనంగా ఉన్నారు. తర్వాత ''ఇక్కడ నాకు బాగానే ఉంది నాయనా! అసలిక్కడ నేను ఒంటరిగా ఉంటున్నాననే ఫీలింగ్ కలగటం లేదు.'' అన్నారు. ఆ మాటల వెనుక ఎక్కడకు వచ్చేది లేదనే, అర్థం దాగి ఉందనే నిజాన్ని గ్రహించిన చిన్నకొడుకు మౌనంగా ఉండిపోయాడు.

**అంత రాత్రిలోను, చలిలోను ఒక్కసారి వెళ్ళి చెట్టును చూడాలనిపించింది. మంచం మీద నుంచి లేచి, తలుపు తీసి వాకిట్లోకి వచ్చారు. బయటనుంచి చలిగాలి రివ్వున తాకింది శరీరానికి. అక్కడ వుంటే చెట్టుకేసి చూసారు. చిన్నగాలికి చెట్టు కొమ్మలు మొత్తం చిన్నగా కదిలాయి.**



ఆ రాత్రి కూడా పెద్దకొడుకు, కోడలు, కూతురు, అల్లుడు తమ వద్దకు రమ్మని కోరటంతో భోజనం ముగించి, తన గదిలో దుప్పటి కప్పుకుని, ఆలోచనలో పడ్డారు, రాఘవ రావుగారు.

వెంటనే తన మిత్రుడు శేషగిరి గుర్తుకు వచ్చాడు.

ఒంటరిగా హాయిగా ఉండే శేషగిరి, పట్నంలో ఉద్యోగం చేసుకుంటున్న ఒక్కగానొక్క కొడుకు రమ్మనగానే ఉన్న పొలం, ఇల్లు అమ్మేసి వెళ్ళి డబ్బు మొత్తం కొడుకు చేతిలో పెట్టాడు. కొన్ని రోజులు బాగానే చూసాడు. తర్వాత తండ్రిని తరిమే శాడు. అది భరించలేని శేషగిరి ఆత్మహత్య చేసుకున్నాడు.

అది తలచుకోగానే రాఘవరావుగారి కళ్ళ నుండి రెండు కన్నీటి బొట్లు రాలాయి.

కానీ తన కొడుకులు అంతటి దుర్మార్గులు కారనే నమ్మకం ఉంది ఆయనకి. తన పెంపకం మీద గట్టి విశ్వాసం ఉంది. అయినా దూరంగానే ఉండటం మంచిది. తనమీద బిడ్డల కున్న ప్రేమ ఎప్పటికీ ఇలాగే ఉండాలంటే, వారి వద్దకు వెళ్ళ కుండా ఉండటమే ఉత్తమమార్గం- అని నిర్ణయించుకున్నారు రాఘవరావుగారు.

వెంటనే అంత రాత్రిలోను, చలిలోను ఒక్కసారి వెళ్ళి చెట్టును చూడాలనిపించింది. మంచం మీద నుంచి లేచి, తలుపు తీసి వాకిట్లోకి వచ్చారు. బయటనుంచి చలిగాలి రివ్వున తాకింది శరీరానికి. అక్కడ వుంటే చెట్టుకేసి చూసారు. చిన్నగాలికి చెట్టు కొమ్మలు మొత్తం చిన్నగా కదిలాయి. ఆ కదలిక నన్ను విడిచి ఎక్కడికీ వెళ్ళవుకదూ! అని బతిమిలాడుతు న్నట్టనిపించింది రాఘవరావుగారికి.

''నిన్ను ఈ ఇంటిని విడిచి ఎక్కడికీ వెళ్ళను. ఇక్కడి అనుభూతులు మరపురానివి. నిన్ను నేను, నా భార్య, నా పిల్లలతో పాటు పెంచుకున్నాము. నా పిల్లలనైనా కాదంటాను గాని, నిన్ను మాత్రం విడిచిపోను'' అనుకుని తిరిగి వచ్చి మంచంలో నిండా, దుప్పటి కప్పుకుని పడుకున్నారు.

★★★

మరుసటి రోజు అందరూ ''మేం రమ్మని ఎంతగా బ్రతిమిలాడినా మీరు రావటం లేదు. కానీ మీ ఇష్టాన్ని కాదనం, వెళ్ళొస్తాం.'' అని చెప్పి వెళుతుంటే, కళ్ళనీళ్ళు పెట్టుకుంటూ వీడ్కోలుగా చెయ్యి ఊపారు రాఘవరావుగారు అందరివైపు చూసి.

ఆయన కళ్ళ నీళ్ళు చూసి, తాను కూడా కళ్ళనీళ్ళు పెట్టుకున్న పెద్దకొడుకు ''చెట్టు నీడ ఉంది అందరి కోసం. మన సొంతం చేసుకోవాలనుకోవటం స్వార్థం కదూ!'' అన్నాడు చెట్టులాంటి తండ్రిని చూస్తూ- అవునన్నట్టు తలలూపారు అందరూ.

★

**పి.ఎం.సుందరరావు**